గొంతెండుతోంది!

- ఎన్టీఆర్‌నగర్‌లో దాహం దాహం
- పైప్‌లైన్ మరమ్మతు కోసం గుంతలు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్లు
- ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వివిధ కాలనీలు, బస్తీవాసులు దాహంతో అల్లాడిపోతున్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ పరిసర ప్రాంత బస్తీవాసులు నిత్యం తాగునీటి కోసం తంటలు పడాల్సిందే. ప్రతి వేసవిలో తాగునీటితో సమస్యతో ఇక్కడి ప్రజలు సతమతమతున్నా ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులు మాత్రం స్పందించకపోవడం బాధాకరమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి మొదలయిందంటే తాగునీటి కష్టాలు వెంటాడుతాయి. రోజు విడిచి రోజు వచ్చే కృష్ణ నీరు వారం రోజులకు ఒక్కసారి వస్తున్నాయి. అవికూడా పది నిమిషాల్లోపే ఆగిపోవడంతో అందరికీ సరిపడే నీరు అందక డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంటుందని బస్తీవాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా స్థానికులు ప్రైవేట్, జలమండలి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశించినా..

తమబస్తీలో తాగునీరు రావడం లేదని స్థానికులు



ఎన్టీఆర్‌నగర్‌లో డ్రమ్ములు పెట్టి నీటి కోసం ఎదురుచూస్తున్న కాలనీవాసులు

ఆందోళన వ్యక్తం చేయడంలో స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గతంలో ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించి తాగునీటి సమస్యలను నేరుగా పరిశీలించారు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి బస్తీ వాసులకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. అయినా.. జలమండలి అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకొకపోవడంతో ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది.

30 వేల జనాభా..

ఎన్టీఆర్‌నగర్ ఫేజ్–1, 2, 3లో దాదాపు 30 వేల జనాభా ఉంటున్నారు. అందరూ పేద, మధ్య తరగతి ప్రజలే. ఈ ప్రాంతంలో ఎప్పుడూ తాగునీటి సమస్యతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా బస్తీల వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే మా కాలనీ,బస్తీలో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతు పేరిట తవ్వకాలు..

వాల్వులు, లీకేజీలకు కోసం గతంలో గుంతలు **తవ్విన అధికారులు** మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో బస్తీలో తాగునీటి సమస్య తలెత్తుతుందని బస్తీవాసులు వాపోతున్నారు. ఎన్టీఆర్‌నగర్ ఫేజ్–1లో ఎత్తున్న ఉన్న ఇళ్లల్లోకి ఒక్కనీటి చుక్క కూడా రావడంలేదని బస్తీవాసులు వాపోతున్నారు. వేసవి కావడంతో బోర్లు సైతం పూర్తిగా ఇంకిపోయాయి. తప్పని పరిస్థితుల్లో డబ్బులు ఖర్చుచేసి ట్యాంకర్లతోతో పోయించుకుంటున్నామని పేర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులు స్పందించి ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నాం



ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీరు అస్సలు రావడం లేదు. జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. డబ్బులు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఎన్టీఆర్‌నగర్ బస్తీలో తాగునీటి సరఫరా అయ్యేలా చొరవ తీసుకోవాలి.

– పోచమ్మ, ఎన్టీఆర్‌నగర్

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.25, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.16, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.50, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.25, కీర రూ.45, బీన్స్ రూ.105, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

యూనిఫామ్స్ అందజేత



యూనిఫామ్స్ అందజేస్తున్న రాధాకృష్ణ

మలక్‌పేట: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం యూనిఫామ్స్ పంపిణీ చేసినట్లు సైదాబాద్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ తిరునగరి రాధాకృష్ణ తెలిపారు. సైదాబాద్–1లోని 1179 మంది బాలురులు, 1374 మంది బాలికల కోసం యూనిఫాంలను ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్లు తెలిపారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అంబర్‌పేట మండలానికి చెందిన 62 మందికి మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను గురువారం అందజేసి మాట్లాడారు. పేదింటి ఆడ బిడ్డలకు షాదీ ముబారక్ వరం లాంటిదన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



నాగోలు: ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కొత్తపేట ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న పలు వ్యాపారాలను తొలగించారు. సర్వీస్ రోడ్లు, ఫుత్‌పాత్‌లు ఆక్రమించుకొని వ్యాపారులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిరు వ్యాపారులు, తొప్పుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మీకు కేటాయించిన స్థలంలో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మీర్జా రియాజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్: జీహెచ్ఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రియాజ్‌ను ఓల్డ్‌మలక్‌పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌకి రవికుమార్, రాము, మహ్మద్‌గౌస్ కలిసి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మలక్‌పేట నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరినట్లు తెలిపారు.

బ్రెయిలీ పాఠ్య పుస్తకాలు సిద్ధం



చాదర్‌ఘాట్: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి బ్రెయిలీ పాఠ్య పుస్తకాలు సిద్ధం చేశామని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. ఒకటి నుంచి పదవ తరగతి వరకు అన్ని మాధ్యమాల్లో పుస్తకాలు సిద్ధం చేశామని అధునాతనమైన మిషన్లతో పుస్తకాల ముద్రణ జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల సంబంధిత అధికారులకు పుస్తకాలు అందజేస్తామన్నారు. పాఠ్య పుస్తకాలు కావాల్సిన వారు మలక్‌పేటలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయానికి వచ్చి మేనేజర్‌ను సంప్రదించాలన్నారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేద్దాం

మన్సూరాబాద్: దేశ సైనికుల గౌరవార్థంగా తిరంగా యాత్రకు పెద్ద ఎత్తున తరలివెళ్దామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మన్సూరాబాద్‌లోని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ పౌరులు, సైనికుల్లో మనోధైర్యాన్ని నింపటానికి కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రాలు, డివిజన్లలో తిరంగా ర్యాలీలను చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఈ నెల 17న ట్యాంక్‌బండ్ వద్ద జరిగే తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సుభాష్‌చందర్‌జీ, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూధన్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, పవన్ కుమార్, రంగ నర్సింహ్మాగుప్తా, నాయకులు శ్రీకాంత్, కొత్త రవీందర్‌గౌడ్, రాఘవేందర్‌రావు, చింతల సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకుల సమక్షంలో వాగ్వాదం

సమావేశం అనంతరం జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో పాటు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పార్టీ నేతల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. రాష్ట్ర పరిశీలకుల సమక్షంలోనే నేతలు ఒకరిపై మరొకరు పరుష పదజాలంతో దూషించుకున్నారు. తమ డివిజన్లలో మాకు ప్రాధాన్యం ఇవ్వకుండా జిల్లా అధ్యక్షుడు గ్రూప్ తగదాలు సృష్టిస్తున్నాడని కొంతమంది కార్పొరేటర్లు జిల్లా అధ్యక్షుడితో వాగ్వాదానికి దిగారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సకాలంలో పనులు పూర్తి చేయాలి

నాగోలు: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. భరత్‌నగర్ ఫేస్–1, రాజీవ్‌గాంధీ నగర్ ఫేస్–2 లో పర్యటించిన ఆయన భరత్‌నగర్ ఫేస్–1 నుంచి రాజీవ్‌గాంధీ నగర్ వరకు రూ. 49 లక్షల వ్యాయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులను పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట రామచందర్, స్వామి, వెంకటేష్, బిక్షపతి, మల్లేష్ యాదవ్, సైదులు, బాలు, సాయి, సుందర్ నారాయణ, తోట మహేందర్ యాదవ్ ఉన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

ఆర్టీసీ సిబ్బందికి 'ప్రగతిచక్రం' పురస్కారాలు



చైతన్యపురి: నిబద్ధతతో పనిచేసే సిబ్బంది ఆర్టీసీ సంస్థకు ప్రగతి చక్రాల్లాంటి వారని రోడ్డు రవాణా సంస్థ రంగారెడ్డి రీజియన్ మేనేజర్ శ్రీలత అన్నారు. రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2డిపోలో గురువారం ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజనల్ మేనేజర్ సరస్వతి, పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాస్, కస్టమర్ రిలేషన్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

మలక్‌పేట: ఈ నెల 1 నుంచి 15 రోజులు పాటు మలక్‌పేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సైదాబాద్ మండల డిప్యూటీ ఈవో తిరునగరి రాధాకృష్ణ హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలను సాధన చేస్తూ మరింతగా రాణించాలని సూచించారు. డ్యాన్స్, లలిత కళలు, స్పోకెన్ ఇంగ్లిష్, బేసిక్ సైంటిఫిక్స్‌పై ఉచిత శిక్షణ ఇచ్చారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాధాకృష్ణ

దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. వినాయక్‌నగర్ కాలనీ ఫేజ్–2, ఎల్లారెడ్డికాలనీలలోని రూ.25 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పనులను ఆయన హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. పలుమార్లు టెండర్లు జరిగి కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో ఆగిపోయాయన్నారు. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జీఎం శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి రీ టెండరింగ్ చేయించడం జరిగిందని వివరించారు. కాలనీవాసులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. త్వరలో అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళ్లెం శంకర్‌రెడ్డి, జిట్ట మహేష్, కొండల్, రమణా రెడ్డి, రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వినికిడి పరీక్షలు షురూ

వనస్థలిపురం: వనస్థలిపురం డబుల్ రోడ్డులోని హియర్ వెల్, స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సెంటర్ వద్ద ఈ నెల 15 నుంచి 19 వరకు ఉచిత వినికిడి పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యాధునిక చెవి మిషన్లతో ఉచితంగా ట్రయల్స్ నిర్వహిస్తామని ఉదయం 11నుంచి సాయంత్రం 7 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు.

ఘనంగా జాతర మహోత్సవం

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సాహెబ్‌నగర్‌లోని శ్రీ త్రినేత్ర ఆంజనేయస్వామి దేవస్థానంలో జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.గురువారం తెల్లవారుజామున రథోత్సవం, రావణదహన కార్యక్రమం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, మహాహారతి, మంత్రపుష్పం, పల్లకి, ఊరేగింపు నిర్వహించారు. బుధవారం రాత్రి జరిగిన పూజలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న, ఆలయ ఈవో ఎల్.మురళీకృష్ణ, నాయకులు చంద్రకాంత్‌గౌడ్,సదాశివుడు, నరసింహయాదవ్, రామారావు, అశోక్‌గౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు ప్రారంభించిన కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్–సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సైదాబాద్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానికులు సైతం తరచూ పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చారి, అచ్యుత రామయ్య, పండరినాథ్, పరమేష్, కిషోర్, చందు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

వనస్థలిపురం: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల వైద్యం కోసం ఎంతో ఉపయోగపడుతోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ యశోదనగర్ కాలనీకి చెందిన బొడ్డు సరోజ, వనస్థలిపురం కాంప్లెక్స్‌కు చెందిన జక్కర్తి మారెమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను గురువారం ఆయన అందజేశారు.

గృహిణి ఆత్మహత్య కేసులో నలుగురి రిమాండ్

నాగోలు: గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులను ఎల్‌బీనగర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం. ఖమ్మం పట్టణానికి చెందిన జాస్మిన్‌ను ఎల్‌బీనగర్ శివపురికాలనీ చెందిన పెండెం రాజశేఖర్‌తో 2021లో వివాహం జరిగింది. అప్పటి నుండి రాజశేఖర్, అతడి తమ్ముడు పెండెం నగేష్, చెల్లి రుద్రా భార్గవి, బావ రుద్రా రాధాకృష్ణ,తల్లి సరిత గత కొంకాలంగా జాస్మిన్‌ను వరకట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో వారి వేధింపులు భరించలేక మంగళవారం జాస్మిన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కుమార్తె మృతికి ఆమె భర్త, ఇతర కుటుంబ సభ్యులు వేధింపులే కారణమని మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం రాజశేఖర్, బార్గవి, రాధాకృష్ణ, సరితను రిమాండ్‌కు తరలించారు.

కార్పొరేటర్ తీరును మార్చుకోవాలి

మన్సూరాబాద్: ప్రొటోకాల్ రాద్ధాంతం చేసే కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తానే ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారని, కార్పొరేటర్ తన తీరును మార్చుకోవాలని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి హితవు పలికారు. ఇందిరానగర్‌కాలనీలో గురువారం ఆయన డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు కార్పొరేటర్ కూడా హాజరై ఏప్రిల్ 7న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని వివరించారు. శంకుస్థాపన చేసిన పనులను మళ్లీ శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపనలు చేసిన పెద్దలను అగౌరవపరచడంసమంజసం కాదని సూచించారు. అనితానగర్ కాలనీలో రూ.33 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీహాల్‌ను, ఓపెన్ జిమ్‌ను కాలనీవాసులపై ఒత్తిడి పెంచి మళ్లీ శంకుస్థాపనలు చేయటం అనైతికమన్నారు. కార్పొరేటర్ దమ్ముంటే ముందస్తుగా సమాచారం ఇచ్చి శంకుస్థాపనలు చేయాలని సవాల్ చేశారు. ఈ సమావేశంలో పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, చంద్రమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రాజకీయం చేయడం తగదు..

హిందూ సంప్రదాయం ప్రకారం మంచిరోజు ఉండటంతో కాలనీవాసుల ఆహ్వానం మేరకు కమ్యూనిటీహాల్ గృహప్రవేశ పూజలో పాల్గొన్నానని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గత నెలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి శంకుస్థాపన చేసింది వాస్తవమేనని, పూజా కార్యక్రమంలో పాల్గొన్నందుకు రాజకీయం చేయటం తగదన్నారు. జీహెచ్ఎంసీ అధికారింగా చెప్పిన కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేతో పాల్గొనడం జరుగుతుందని, లేకుంటే మీ ప్రొటోకాల్ మీది.. మా ప్రొటోకాల్ మాది అని స్పష్టం చేశారు.

సీబీఎస్ఈలో సత్తా



కుర్ర హన్సిత



అక్షత్ పాథక్



జెమిమా రేపాకలు

హయత్‌నగర్: సీబీఎస్ఈ ఫలితాల్లో హయత్‌నగర్‌లోని జీ హై స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో 10, 12వ తరగతులకు చెందిన మొత్తం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కుర్ర హన్సిత 97.20 మార్కులు, అక్షత్ పాథక్, జెమిమా రేపాకలు 97 శాతం మార్కులు సాధించారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధన, ప్రత్యేకమైన విధానంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, అనంతరెడ్డి, నాగేంద్రబాబులు తెలిపారు. విద్యార్థులను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పూర్ణా శ్రీవాత్సవ, సీఈఓ గిరిజానెడ్డి పాల్గొన్నారు.

హస్తినాపురంను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం ఆమె వందనపురికాలనీలో పర్యటిస్తూ మాట్లాడారు. డివిజన్ పరిధిలోని అన్నిప్రాంతాలలో వరదనీటి సమస్యను పరిష్కరించేందుకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

భారీ వర్షాలతో వివిధ కాలనీల్లో వరదనీటితో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా రూ.7.50 కోట్ల మంజూరు చేయించారన్నారు. కార్పొరేటర్ వెంట గోపి రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజుగౌడ్, మమత, మల్లేశ్‌గౌడ్ ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సుజాతానాయక్

సమ్మె నోటీసుల అందజేత

వనస్థలిపురం: దేశవ్యాప్తంగా మే 20న వామపక్ష ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు అన్ని రంగాల కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు ఆధ్వర్యంలో సమ్మెకు మద్దతు తెలపాలని గురువారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.కృష్ణ, మెడికల్ కళాశాల అదనపు సూపరింటెండెంట్ డా.నాగేందర్‌కు సమ్మె నోటీసులను అందజేశారు. భాగ్యమ్మ, రమావత్ సక్రు నాయక్, నరసింహ, మంగ, రవికిరణ్, ప్రశాంతి, సునీత, ప్రభావతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నాగోలు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ సూచించారు. నాగోలు డివిజన్ పరిధి చాణక్యపురికాలనీలో గురువారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. కాలనీలోని రోడ్లపై చెత్తాచెదారాలు ఉండకుండా ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. కాలనీ వాసులు కూడా రోడ్లపై చెత్త వేయకుండా స్వచ్ఛఆటోలకు ఇవ్వాలని సూచించారు. 15 రోజులకోసారి స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రతి కాలనీలో నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ నుంచి వచ్చిన స్పోర్ట్స్ కిట్స్‌ను కాలనీవాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చలపతిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీధర్ బాబు, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్–1లో డ్రైనేజీ వ్యవస్థ ఇబ్బందికరంగా ఉందని దాన్ని తొలగించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా గురువారం ఆయన జలమండలి మేనేజర్ సిరివెన్నెల, కాలనీ వాసులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నూతన పైపులైన్ ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పురుషోత్తంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాములు, భిక్షపతి, కాశిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.